కొత్త కొలువుల లోకం



- ఐటీఐ విద్యార్థులకు మహర్దశ
- పరిశ్రమలతో యంత్రాంగం సంప్రదింపులు

బొబ్బిలి, న్యూస్‌టుడే: ఐటీఐ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. స్థానికంగా ఉన్న పరిశ్రమల్లో వారికి కొలువులు ఇచ్చేందుకు అడుగులు వేస్తోంది. ఏ తరహా పరిశ్రమలున్నాయి? వాటిలో ఎంతమంది చేరవచ్చు.. తదితర వివరాలను సేకరిస్తోంది. ఇప్పటికే క్షేత్రస్థాయిలో సంబంధిత సర్వే ప్రారంభమైంది.

అనుసంధానంతో..

తాజాగా తీసుకున్న నిర్ణయాలతో కోర్సులు పూర్తి చేసినవారికి శత శాతం ఉపాధి దక్కనుంది. ఐటీఐల పరిధిలో ఉన్న పరిశ్రమలను గుర్తించి అనుసంధానం చేస్తారు. ఈమేరకు సంబంధిత యజమానులతో ఒప్పందం చేసుకుంటారు. రెండు జిల్లాల్లో ఎక్కువగా జనపనార, చక్కెర, ఫెర్రో అల్లాయిస్, రసాయన పరిశ్రమలున్నాయి. ఇప్పటికే ఆయా యాజమాన్య ప్రతినిధులతో అధికారులు సంప్రదింపులు జరిపారు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో

ప్రత్యేక తర్ఫీదు..

ఐటీఐల్లో చదువుతో పాటు ప్రయోగ పరీక్షలు కీలకం. పరిశ్రమలకు ఏ తరహా నైపుణ్యాలు అవసరమో ముందుగానే తెలుసుకుని ఆ మేరకు తర్ఫీదు ఇస్తున్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం కొన్ని ప్రభుత్వ ఐటీఐలను గుర్తించి అధునాతన యంత్రాల కొనుగోలుకు నిధులు విడుదల చేసింది. అందులో భాగంగా బొబ్బిలి, రాజాం విద్యాలయాలకు మంజూరయ్యాయి. ఈ సొమ్ముతో యంత్రాలు, మౌలిక సదుపాయాలు కల్పించారు. ఇప్పటికే కంప్యూటర్‌తో పాటు వివిధ రకాల శిక్షణలు ఇస్తున్నారు.


బొబ్బిలిలోని ఐటీఐలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

రాజాం, బొబ్బిలి, సాలూరు, విజయనగరం, భద్రగిరిలో ప్రభుత్వ, మరో 16 ప్రైవేటు ఐటీఐలు నడుస్తున్నాయి. ప్రైవేటు విద్యార్థులకు కూడా అవకాశాలు దక్కనున్నాయి. స్థానికంగా ఉన్న కంపెనీలతో పాటు విశాఖ, అమరావతి, కాకినాడ, నెల్లూరు, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లోనూ కొలువులకు ఎంపికలు చేయనున్నారు.

అందరికీ ఉపాధి అవకాశాలు..

ఐటీఐల్లో చేరిన విద్యార్థులందరికీ ఉపాధి కల్పించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పరిశ్రమలతో ఐటీఐలను అనుసంధానం చేసే ప్రక్రియ ప్రారంభమైంది. స్థానికంగా ఉన్నవాటితో పాటు ఉమ్మడి రాష్ట్రంలో నడుస్తున్న కంపెనీల ప్రతినిధులతో మాట్లాడుతున్నాం. శిక్షణ పూర్తయ్యాక నైపుణ్యాల ఆధారంగా కొలువులు దక్కనున్నాయి. ముందుగానే అభ్యర్థులను సన్నద్ధం చేస్తున్నాం.

- జి.వి.రమణారావు, ప్రిన్సిపల్, ప్రభుత్వ ఐటీఐ, బొబ్బిలి

గుర్లలో అదుపులోకి అతిసారం: కొండపల్లి

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: గుర్లలో ఏదో జరిగిపోతోందని ప్రతిపక్షాలు ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మండిపడ్డారు. వ్యాధి తగ్గుముఖం పట్టిందని, కేసుల నమోదుకు గల కారణాలపై విచారణ చేస్తున్నామని చెప్పారు. ఆదివారం విజయనగరంలోని అశోక్ బంగ్లాలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని, ప్రభావిత ప్రాంతాల్లో పెద్దఎత్తున పారిశుద్ధ్య పనులు జరుగుతున్నాయన్నారు. క్లోరినేషన్ ప్రక్రియ ముమ్మరంగా సాగుతోందని, ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందిస్తున్నామని చెప్పారు. ఎవరూ భయాందోళన చెందొద్దని, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆసుపత్రుల్లో చేరిన వారంతా డిశ్చార్జి అవుతున్నారని చెప్పారు. సమస్యలను రాజకీయం చేయడం వైకాపాకు అలవాటే అని తెదేపా విజయనగరం పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు కిమిడి నాగార్జున ఆరోపించారు. కనీసం ఆసుపత్రులకు మందులు అందించలేని మీరు విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, నాయకులు ప్రసాదుల వరప్రసాద్, ఆల్తి బంగారుబాబు, కొండపల్లి భాస్కరనాయుడు, నడిపిల్లి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్, చిత్రంలో నాగార్జున, అదితి తదితరులు

ఇదీ మీ నాణ్యత

గత ప్రభుత్వం రవాణా వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసింది. ముఖ్యంగా రహదారులను కనీసం పట్టించుకోలేదు. మరమ్మతులపై సైతం దృష్టిసారించలేదు. కొన్నిచోట్ల అరకొరగా పనులు చేసినా.. కొన్ని నెలలకే వాటిల్లో నాణ్యతా లోపాలు వెలుగు చూస్తున్నాయి. సాలూరు మండలంలో పలుచోట్ల ఈ పరిస్థితి కనిపిస్తోంది.


బీటీ రోడ్డుపై భారీ పగులు

మండలంలోని తోణాం పంచాయతీ కేంద్రం నుంచి కొఠియా వివాదాస్పద గ్రామమైన దిగువశెంబి వరకు(వయా డిప్పలపాడు) రోడ్డు వేసేందుకు 2021- 22లో రూ.7.79 కోట్లు మంజూరు చేశారు. 6.50 కిలోమీటర్ల మేర నిర్మాణాలు చేపట్టాలని నిర్ణయించారు. మాజీ ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర శంకుస్థాపన చేశారు. 2024 మార్చి 31 నాటికి పూర్తిచేశారు. ప్రస్తుతం మార్గమంతా అధ్వానంగా దర్శనమిస్తోంది. అయిదారు నెలలకే దెబ్బతింది. మధ్యలో భారీ పగుళ్లు వచ్చాయి. ఘాట్ మలుపుల్లో మట్టి వేసి వదిలేయడంతో.. జారిపోతోంది.

వేసింది ఒక్కటే..

కొఠియాలో దాదాపు అన్ని గ్రామాల్లోనూ ఒడిశా ప్రభుత్వమే రహదారులు వేసింది. ఈ ఒక్క రోడ్డునే గత ప్రభుత్వం నిర్మించింది. అది కూడా పాడవడంతో ఆందోళన వ్యక్తమవుతోంది. దీనిపై పీఆర్ ఏఈ శంకరరావును 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. అయిదేళ్ల పాటు గుత్తేదారు నిర్వహణ పనులు చేపట్టాలని, నాణ్యతను పరిశీలించి, తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. – న్యూస్‌టుడే, సాలూరు గ్రామీణం


ఘాట్ ఒడ్డున మట్టి వేసి వదిలేశారిలా..

చివరికి చేరని నీరు

– న్యూస్‌టుడే, సంతకవిటి, వంగర, రాజాం గ్రామీణం

సాగునీటి కష్టాలతో అన్నదాతలు నానా అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం వరి పొట్టదశలో ఉన్న తరుణంలో ఓ వైపు వర్షాలు పడక.. మరోవైపు కాలువల ద్వారా నీరు అందక పంటలు ఎండిపోతున్నాయని కర్షకులు కన్నీరు పెడుతున్నారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికిరాకుండా పోతుందని ఆందోళన చెందుతున్నారు. రాజాం నియోజకవర్గంలోని సంతకవిటి, వంగర, రాజాం, రేగిడి మండలాల్లోని వేలాది ఎకరాల వరి, మొక్కజొన్న, వేరుసెనగ ఎండిపోతున్నాయి.


వంగర మండలం తలగాంలో ఎండిపోయిన వరి పంటను చూపిస్తున్న రైతు

చర్యలు తీసుకుంటాం..

తోటపల్లి కాలువల ద్వారా మొదట్లో అన్ని చెరువులనూ నింపాం. వర్షాభావ పరిస్థితులతో శివారు ఆయకట్టుకు సాగు నీరు అందటం లేదు. రైతుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వారబందీ పద్ధతిలో ఆయకట్టుకు సాగు నీరు అందించేందుకు చర్యలు తీసుకుంటాం.

- శ్రీనివాసరావు, డీఈఈ, తోటపల్లి ప్రాజెక్టు

రైతులు సహకరించాలి..

వర్షాభావ పరిస్థితులతో శివారు ఆయకట్టుకు సాగు నీరు అందడం లేదు. కాలువ మొదట ఉన్నవారు తమ అవసరాలు తీరాక.. దిగువ ప్రాంతాలకు వదలాలి. ప్రస్తుతం నీరు మొదట ఉన్న పొలాలకే సరిపోతోంది. వర్షాలు పడితే తప్ప ఇవ్వలేని పరిస్థితి. **- రవీంద్ర, ఏఈ, మడ్డువలస ప్రాజెక్టు**

ఇదీ పరిస్థితి..

సంతకవిటి మండలంలో మడ్డువలస, తోటపల్లి ప్రాజెక్టు కాలువల ద్వారా బొద్దూరు, గుళ్లసీతారాంపురం, సిరిపురం, జీఎన్.పురం, మంతిన, జానకీపురం, బలరాంపేట, వాల్తేరు తదితర గ్రామాల్లోని 4,500 ఎకరాలకు సాగు నీరు అందడం లేదని రైతులు చెబుతున్నారు. పంటలు ఎండిపోతుంటే ఏమీ చేయలేని స్థితిలో ఉన్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వరి పొట్ట, గింజ కట్టే దశలో ఉందని నీరు అందించి, కాపాడాలని కోరుతున్నారు. ★ రాజాం మండలం అంతకాపల్లి, మొగిలివలస, గుజ్జన్నవలస, రామానుజన్‌పేట, పొగిరి తదితర ప్రాంతాలకు తోటపల్లి కాలువలు ద్వారా నీరు అందాలి. గత అయిదేళ్ల వైకాపా పాలనలో నిర్వహణ పనులు లేకపోవడంతో ప్రస్తుతం ఎండిపోయి కనిపిస్తున్నాయి. దీంతో సుమారు 5 వేల ఎకరాల పంట దెబ్బతింటోంది. ★ వంగర మండలంలో తోటపల్లి పాత కాలువ ద్వారా 4,500 ఎకరాలకు సాగునీరు ఇవ్వాలి. కానీ ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. దీంతో కొత్తవలస, తలగాం, కొప్పరవలస, బంగారువలస, మద్దివలస, రుషింగి, ఎమ్ఎస్ పురం, శివ్వాం ప్రాంతాల అన్నదాతలు ఇబ్బందుల్లోకి వెళ్లిపోయారు. 1,500 ఎకరాల్లో ఇప్పటికే పంట పాడైందని చెబుతున్నారు.


రాజాం మండలం అంతకాపల్లిలో తోటపల్లి కాలువ దుస్థితి

నేడు ఉప ముఖ్యమంత్రి రాక

గరివిడి, విజయనగరం రింగురోడ్డు, న్యూస్‌టుడే: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ సోమవారం గుర్లలో పర్యటించనున్నారని చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు తెలిపారు. ఉదయం 11.30 గంటలకు చేరుకుని, అతిసారం బాధితులను పరామర్శిస్తారన్నారు. గ్రామంలో బోరు బావులు, తాగునీటి వనరులు, చంపావతి నదిలో ఊటబావులను పరిశీలిస్తారని చెప్పారు. అనంతరం విజయనగరంలో పంచాయతీ, గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారులతో సమీక్షిస్తారని చెప్పారు.

ప్రత్యేకాధికారిగా విజయానంద

వ్యాధి విజృంభణపై పూర్తిస్థాయిలో విచారణ జరిపేందుకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానందను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నియమించారు. అతిసారానికి దారితీసిన కారణాలు, నివారణకు అధికారులు తీసుకున్న చర్యలు.. తదితర వివరాలను సేకరించనున్నారు.

మే 20న శ్యామలాంబ పండగ

సాలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: సాలూరు కొలువుదీరిన శ్యామలాంబ అమ్మవారి పండగను వచ్చే ఏడాది మే 20న నిర్వహించనున్నారు. ఆదివారం స్థానిక ఆలయంలో గ్రామ పెద్దలు, నాయకులు సమావేశమయ్యారు. యువరాజు విక్రమచంద్ర సన్యాసిరాజు జాతకాన్ని పురోహితులు పరిశీలించి ముహూర్తం నిర్ణయించగా అంతా అంగీకరించారు. ఈ సందర్భంగా మంత్రి సంధ్యారాణి మాట్లాడుతూ పండగను వైభవంగా, ప్రతిష్ఠాత్మకంగా జరిపించాలన్నారు. తన వంతుగా రూ.5 లక్షల విరాళం ప్రకటించారు.

కంటిపాపకు కష్టాలు

- పిల్లల్లో పెరుగుతున్న దృష్టిలోపం
- తనిఖీల్లో బయట పడుతున్న వైనం



పరీక్షల తీరు ఇలా..

ప్రాంతం	సంఖ్య	కళ్లద్దాలు అవసరం
కురుపాం	15,743	340
సాలూరు	15,182	382
పార్వతీపురం	4901	170
పాలకొండ	11,519	458
పార్వతీపురం పట్టణం	1186	37
పాలకొండ పట్టణం	587	52
సాలూరు పట్టణం	3058	196


కంటి పరీక్షలు చేస్తున్న నేత్ర వైద్య నిపుణులు

బంగారు భవిష్యత్తున్న చిన్నారుల కంటి చూపు మందగిస్తోంది. చిన్న వయసులోనే వారిలో దృష్టి లోపాలు వెలుగు చూస్తున్నాయి. ఈక్రమంలో కళ్లద్దాలు లేకపోతే ఏ పనీ చేయలేని పరిస్థితి ఎదురవుతోంది. మరోవైపు ఉపాధ్యాయుడు బోర్డుపై రాసే అక్షరాలు సరిగా కనిపించక చాలా మంది విద్యార్థులు చదువులో వెనుకబడుతున్నారు. ఇటీవల ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించిన కంటి పరీక్షల్లో భాగంగా వైద్యులు ఈ విషయాలను వెల్లడించారు. ఇప్పటి వరకు 52,176 మందిని పరీక్షించగా 1635 మందికి కళ్లద్దాలు అవసరమని నిర్ధారించారు.

– న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం

కారణాలివీ..

చిన్నారుల చూపు మందగించడానికి ప్రధాన కారణం చరవాణులు వాడటమేనని నిపుణులు చెబుతున్నారు. ఖాళీ సమయంలో దొరికితే కొందరు ఫోన్లకు అతుక్కుపోతున్నారు. పోషకాహార లోపం, జన్యులోపాల వల్ల కూడా కొందరిలో దృష్టిలోపాలు తలెత్తుతున్నాయి. సమస్యలపై అవగాహన కల్పిస్తున్నామని, అవసరమైన వారికి కళ్లద్దాలు అందిస్తామని అంధత్వ నివారణ సంస్థ జిల్లా అధికారి నగేష్ రెడ్డి తెలిపారు.

దృష్టిపెట్టాల్సిందే..

★ పిల్లలు చదివేటప్పుడు పుస్తకాలు మరీ దగ్గరగా పెట్టుకుంటున్నారా? దూరం పెడుతున్నారా గమనించాలి. ★ తరగతి గదిలో వెనుక, ముందు కూర్చున్న వారు బోర్డుపై రాసేదాన్ని అర్థం చేసుకోగలుగుతున్నారా లేదా అన్నది ఉపాధ్యాయుడు తెలుసుకోవాలి. ★ పోషకాలతో కూడిన ఆహారాన్ని అందించాలి. ★ అవసరం మేరకే చరవాణి ఇవ్వాలి. ఖాళీ సమయాల్లో పుస్తకాలు చదివేలా చూడాలి.

3,256 చికిత్సలు ఉచితం

– న్యూస్‌టుడే, వైద్యవిభాగం

ఆరోగ్యం.. ఇప్పుడు ప్రతి ఒక్కరి నినాదం ఇదే.. ఈ నేపథ్యంలో ప్రభుత్వం సైతం సేవలను అందిస్తోంది.. అయితే వాటిని ఎలా సద్వినియోగం చేసుకోవాలి.. ఎన్టీఆర్ వైద్యసేవలో ఎన్ని రకాల చికిత్సలున్నాయి.. ఎవరిని సంప్రదించాలి.. ప్రైవేటు ఆసుపత్రుల్లోనూ అందుబాటులో ఉంటాయా.. తదితర సందేహాలను నివృత్తి చేశారు ఉమ్మడి జిల్లా సమన్వయకర్త డా.యు.ఎ.రాజు. 'న్యూస్‌టుడే' ముఖాముఖిలో పలు వివరాలు వెల్లడించారు.


ముఖాముఖి

- రోగులకు భోజనం, రవాణా సదుపాయం
- 'న్యూస్‌టుడే'తో ఎన్టీఆర్ వైద్యసేవల సమన్వయకర్త

ఆందోళన వద్దు..

ఇటీవల మలేరియా, డెంగీ, ఇతర వైరల్ జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఆయా బాధితులకు సేవలన్నీ ఉచితం. అయితే కొన్ని నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో ప్లేట్‌లెట్లు తగ్గాయని, ఇతరత్రా కారణాలతో అదనంగా వసూలు చేస్తున్నాయనే ఆరోపణలున్నాయి. అలా తీసుకుంటే చర్యలు తప్పవు. ఆయా వ్యాధుల నిర్ధారణ ధ్రువపత్రం ఉంటే ఉచిత చికిత్స పొందవచ్చు. విజయనగరంలోని మహారాజా ఆసుపత్రి నుంచి ధ్రువపత్రాలు జారీ చేస్తున్నాం ఇంకెక్కడా ఆ అవకాశం ఉండదు.

ఆసరాతో అండ

ఈ కార్యక్రమం కింద 3,256 రకాల వ్యాధులకు ఉచితంగా చికిత్స అందిస్తున్నాం. రూ.5 లక్షల వార్షికాదాయం లోపున్నవారు అర్హులు. డిశ్చార్జి అయ్యాక 1536 వ్యాధులకు సంబంధిత ఆసరా పథకం కింద నగదు వస్తుంది. రోజు రూ.225 వరకు ఖాతాలో జమవుతుంది. బాధితులు ఆర్థికంగా ఇబ్బంది పడకూడదని ఈ పథకాన్ని ప్రారంభించారు. గర్భిణి సాధారణ ప్రసవమైనా, శస్త్రచికిత్స జరిగినా రూ.5 వేలు, పక్షవాతం వ్యాధిగ్రస్థులకు రూ.30 వేలు, సోరియాసిస్‌కు రూ.60 వేల చొప్పున అందుతోంది.

యాప్ ఉంటే చాలు..

ఆసుపత్రిలో చికిత్స పొందినన్ని రోజులూ ఉచితంగా భోజనం అందిస్తాం. డిశ్చార్జి అయ్యాక రవాణా ఛార్జీలు కూడా ఇస్తున్నాం. 108 అంబులెన్సుల పనితీరు బాధ్యతలను మా విభాగమే చూస్తోంది. అంబులెన్సుల్లో 51 రకాల సౌకర్యాలు, 51 మందులు కచ్చితంగా ఉండేలా చర్యలు తీసుకున్నాం. రోగుల వివరాలకు సంబంధించిన రికార్డు నిర్వహణ పక్కాగా ఉండేలా దృష్టిసారిస్తున్నాం. ఎన్టీఆర్ వైద్యసేవ యాప్‌ను చరవాణిలో డౌన్‌లోడ్ చేసుకోవాలి. దాని ద్వారా పూర్తిస్థాయిలో వివరాలు తెలుసుకోవచ్చు.

92 ఆసుపత్రుల్లో..

విజయనగరం జిల్లాలో 23 ప్రైవేటు వైద్యాలయాలు, ప్రాంతీయ, సీహెచ్‌సీలు కలిపి 10 చోట్ల, మహారాజా, ఘోష, 44 పీహెచ్‌సీలు, పార్వతీపురం మన్యంలో ఆరు ప్రైవేటు, ఏడు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఈ సేవలు అందుతున్నాయి. ఎక్కువగా గుండె జబ్బులున్నవారు, ఎముకలు, జనరల్ సర్జికల్, గర్భిణులు సద్వినియోగం చేసుకుంటున్నారు. 716 సూపర్ స్పెషాలిటీ చికిత్సలకు అనుమతి ఉంది. హైదరాబాద్, చెన్నై, బెంగళూరు రాష్ట్రాల్లోనూ ఈ పథకం అమలవుతోంది. అక్కడి ఆరోగ్య మిత్ర ప్రతినిధులను కలిసి సమస్యను వివరిస్తే వారు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి మార్గం చూపుతారు.



ఇబ్బందులు లేకుండా..

కార్డులో లబ్ధిదారులుగా ఉండడం తప్పనిసరి. పాత వారికి ఇబ్బంది లేదు. ఒకవేళ పేరు లేకపోతే, ఇతరత్రా సమస్యలున్నా వారికి ఇబ్బంది లేకుండా చూస్తున్నాం. ఏ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారో సదరు వైద్యులు సమస్యను వివరిస్తూ ఒక రిపోర్టు ఇవ్వాల్సి ఉంటుంది. దానిని ఆరోగ్య మిత్రకు ఇస్తే మా దృష్టికి తీసుకొస్తారు. రూ.5 లక్షల లోపు వార్షికాదాయం, 12 ఎకరాల లోపు మాగాణి, 35 ఎకరాల లోపు మెట్ట ఉంటే అర్హులుగా గుర్తిస్తాం. శాశ్వత ప్రభుత్వ ఉద్యోగి, పింఛనుదారులను పరిగణనలోకి తీసుకోం.

సమస్యలుంటే చెప్పండి..

సేవల్లో లోపాలున్నా, సందేహాలున్నా 104 టోల్ ఫ్రీ నంబరును సంప్రదించవచ్చు. అన్ని నెట్‌వర్క్ ఆసుపత్రుల్లోనూ ఆరోగ్య మిత్ర ఉంటారు. అక్కడ 104తో పాటు టీమ్ లీడర్లు, ఉన్నతాధికారుల నంబర్లు ఉంటాయి. వారితో మాట్లాడవచ్చు.

బీమా.. ఆరోగ్య దీమా



విజయనగరంలోని టీటీడీసీలో ఉన్న బీమా కాల్‌సెంటర్

విజయనగరం మయూరికూడలి, ఎస్.కోట న్యూస్‌టుడే: 'వివరాలు పొందుపరిచిన 15 రోజుల్లోనే బీమా అందిస్తాం' అని గత ప్రభుత్వం మాయమాటలు చెప్పింది. వాస్తవానికి అధికారంలోకి వచ్చిన రెండేళ్ల తరువాత ఈ పథకాన్ని ప్రారంభించిన వైకాపా.. బాధిత కుటుంబాలకు పూర్తిస్థాయిలో ఆర్థికసాయం అందించలేకపోయింది. కనీసం అంత్యక్రియలకు ఇవ్వాల్సిన రూ.10 వేలు సైతం వారికి దక్కలేదు. కొత్తగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఈ సమస్యలపై దృష్టిసారించింది. దారిద్ర్యరేఖకు దిగువనున్న కుటుంబాల్లో 18 ఏళ్లు దాటిన ప్రతిఒక్కరికీ పథకం వర్తింప చేసేందుకు చర్యలు తీసుకుంటోంది. ఈమేరకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఇటీవల ఆదేశాలు జారీ చేసింది.

వర్తింపు ఇలా..

గతంలో తెదేపా హయాంలో తెల్ల రేషన్ కార్డు ఉండి కుటుంబంలో 18 ఏళ్ల నిండి ఎంత మంది ఉన్నా బీమా వర్తించేది. 50 నుంచి 60 ఏళ్ల లోపు వారు సహజ మరణం పొందితే రూ.2 లక్షలు, 50 ఏళ్లు దాటితే రూ.30 వేలు ఇచ్చేవారు. ప్రమాదవశాత్తూ మరణిస్తే రూ.5 లక్షలు దక్కేది. 14 రోజుల్లోనే క్లెయిమ్‌ను పరిష్కరించేవారు. ఈ సారి బీపీఎల్ కుటుంబాల్లో 18 నుంచి 70 ఏళ్ల వారికి లబ్ధి చేకూర్చేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ప్రమాదవశాత్తూ మరణిస్తే రూ.10 లక్షలు, సాధారణ మరణమైతే రూ.2 లక్షలు ఇచ్చేందుకు ఆలోచన చేస్తోంది. వైకాపా హయాంలో రూ.5 లక్షలు, రూ.లక్ష ఇస్తామని చెప్పింది. కొందరికే నగదు అందింది. రెండు జిల్లాల్లో ఇంకా 500 మంది వరకు ఎదురు చూస్తున్నారు.


నిర్ణయం తీసుకోవాలి..

జూన్ నుంచి పథకం రద్దయింది. కొత్తగా విధివిధానాలు ఖరారు కావాలి. చంద్రన్న బీమా పథకం అమల్లోకి రానుంది. ప్రస్తుతానికి మృతుల వివరాలు సేకరిస్తున్నాం. పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

- కల్యాణ్ చక్రవర్తి, డీఆర్డీఏ పీడీ

పనులు ఆగాయి.. పాట్లు మిగిలాయి

కొట్టుకుపోయిన రహదారి



సాలూరు మండలం పట్టుచెన్నూరు పంచాయతీ పనసలవలసకు వెళ్లే రహదారిది. పనులు పూర్తికాక ముందే వర్షాలకు ఇలా కొట్టుకుపోయింది. తోణాం పంచాయతీ బూర్జవలస నుంచి పట్టుచెన్నూరు పంచాయతీ గుంజమడకు, గుంజమడ కూడలి నుంచి పనసలవలసకు రహదారి నిర్మాణానికి 2022లో ఉపాధి హామీ కింద నిధులు మంజూరయ్యాయి. బూర్జ నుంచి గుంజమండకు 1.7 కి.మీ. మేర బీటీరోడ్డుకు రూ.1.35 కోట్లు, కూడలి నుంచి పనసలవలసకు 800 మీటర్ల సీసీ రోడ్డుకు రూ.70 లక్షలతో 2023లో పనులు ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది మార్చిలో పిక్క వేశారు. బీటీ, సీసీ పనులు జరగక ముందే ఎన్నికలు వచ్చాయి. గుత్తేదారుకు రూ.12 లక్షల బిల్లులు పెండింగులో ఉండటంతో పనులు నిలిపి వేశారు. ఇటీవల వర్షాలకు ఈ రోడ్డు కొట్టుకుపోయింది. దీనిపై ఐటీడీఏ ఏఈ సంతోష్ మాట్లాడుతూ రహదారికి మరమ్మతు చేసి, సీసీ రోడ్డు వేస్తామన్నారు.

– న్యూస్‌టుడే, సాలూరు గ్రామీణం

పంట అమ్మాలన్నా.. ఆసుపత్రికి వెళ్లాలన్నా అవస్థలే

గుమ్మలక్ష్మీపురం మండలంలోని మారుమూల కొండపై ఉన్న జోగిపురానికి రహదారి సౌకర్యం లేకపోవడంతో గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. అటవీ ఉత్పత్తులు అమ్మకాలకు, అత్యవసర సమయాల్లో ఆసుపత్రికి వెళ్లాలన్నా రాళ్లు తేలిన రహదారిలోనే 4 కి.మీ. మేర నడవాల్సిన పరిస్థితి. శ్రమదానం చేసినా ఫలితం కనిపించడం లేదు. రహదారుల్లేని గ్రామాలను గుర్తించామని, త్వరలో పనులు చేస్తామని ఎమ్మెల్యే జగదీశ్వరి పేర్కొన్నారు.

– న్యూస్‌టుడే, గుమ్మలక్ష్మీపురం



రాళ్లు తేలిన దారిలో అమ్మకాలకు సీతాఫలం తీసుకెళ్తున్న గిరిజనులు

ప్రయాణం.. చోదకుల్లో భయం

కూనేరు దారిలో వరుసగా లారీలకు ప్రమాదాలు



పూర్ణపాడు సమీపంలో నిలిచిన లారీ

పార్వతీపురం నుంచి ఒడిశా వెళ్లే వాహనదారుల కష్టాలు అన్నీ ఇన్నీ కావు. కొమరాడ మండలంలోని పలు చోట్ల రహదారి అధ్వానంగా మారడంతో ప్రయాణానికి ఇబ్బందులు పడుతున్నారు. శనివారం కూనేరు, గుమడ వద్ద లారీలు గుంతల్లో కూరుకుపోయి 4 గంటల పాటు రాకపోకలకు అంతరాయం కలగగా.. ఆదివారం పూర్ణపాడు సమీపంలో గొయ్యిని తప్పించబోయి ఓ లారీ ఇరుసు విరిగిపోయింది. దీంతో 6 గంటల పాటు రహదారి మధ్యలో ఉండిపోయింది. కొమరాడ పోలీసులు చేరుకొని ఒక్కో వాహనాన్ని దారి మళ్లించారు. ఆదివారం కావడంతో విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం నుంచి రాయగడ మజ్జిగౌరమ్మ ఆలయానికి ఎక్కువగా రాకపోకలున్న నేపథ్యంలో అవస్థలు తప్పలేదు.

నిత్యం ఇదే తంటా..

పార్వతీపురం నుంచి కూనేరు ప్రయాణం అంటేనే చోదకుల గుండెల్లో గుబులు పుడుతోందని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు సాంబమూర్తి అన్నారు. ఆదివారం పూర్ణపాడు వద్ద స్థానికులతో కలిసి నిరసన తెలిపారు. వాహనాలు పాడవుతున్నా కనీసం ఎలాంటి చర్యలు చేపట్టడం లేదన్నారు. రహదారికి మరమ్మతులు చేయకపోతే రామభద్రపురం, సాలూరు మీదగా ఒడిశాకు దారి మళ్లించాలని కోరారు. ఈ మార్గంలో వెళ్లేందుకు విద్యార్థులు, ఉద్యోగులు, ప్రయాణికులు అవస్థలు పడుతున్నారని వెల్లడించారు.

–న్యూస్‌టుడే, కొమరాడ

ఏటా నాలుగుసార్లు డ్వాక్రా బజార్లు

సరస్ ముగింపు సమావేశంలో మంత్రి శ్రీనివాస్



మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి

విజయనగరం మయూరి కూడలి, న్యూస్‌టుడే: అంతర్జాతీయ డ్వాక్రా బజార్ సరస్- 2024కు జిల్లాలో విశేష స్పందన వచ్చిందని, ఏటా నాలుగుసార్లు ఇలాంటివి ఏర్పాటు చేయనున్నట్లు ప్రణాళికలు తయారు చేస్తున్నామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వెల్లడించారు. విజయనగరం ఉత్సవాల సందర్భంగా స్థానిక డీఆర్డీఏ, సెర్ప్, నాబార్డు, యూనిసెఫ్, ఆప్కాబ్, డీసీసీబీ, స్త్రీనిధి వంటి సంస్థల ఆధ్వర్యంలో ఈనెల 10న ప్రారంభించిన అఖిల భారత సరస్ -2024 ముగింపు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మహిళలను ప్రోత్సహించేందుకు ఎదగడానికి అన్ని అవకాశాలు కల్పిస్తున్నారన్నారు. జిల్లాలో ఏర్పాటు చేసిన ఈ సరస్‌లో సుమారు రూ.7.50 కోట్ల మేర అమ్మకాలు జరిగాయని, 40 వేల మంది వరకు సందర్శించారని తెలిపారు. విజయనగరం, నెల్లిమర్ల శాసనసభ్యులు పూసపాటి అదితి గజపతిరాజు, లోకం నాగమాధవి మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధి దిశగా ఎదగడానికి ఎంత రుణం ఇవ్వడానికైనా ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కలెక్టర్ డా.బి.ఆర్.అంబేడ్కర్, డీఆర్డీఏ పీడీ కల్యాణ్‌చక్రవర్తి, ఏపీడీ సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

నాడు-నేడు పనులు.. మూలుగుతున్నాయ్!

న్యూస్‌టుడే- సంతకవిటి, రాజాం గ్రామీణం, వంగర

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యను అందించడానికి నాడు-నేడు ద్వారా మౌలిక వసతుల కల్పన, వసతి సమస్య పరిష్కారానికి గత ప్రభుత్వం అట్టహాసంగా పనులు ప్రారంభించింది. రెండో విడత పనులు ఆయిదేళ్లు గడిచినా ఇంకా మూలుగుతూనే ఉన్నాయి. విద్యార్థులకు అదనపు తరగతుల నిర్మాణాలు పూర్తికాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని ఉపాధ్యాయులు వాపోతున్నారు. ఈ సమస్య రాజాం నియోజక వర్గంలోని సంతకవిటి, రాజాం, వంగర, రేగిడి మండలాల్లో తీవ్రంగా ఉంది.

★ గత ప్రభుత్వం సంతకవిటి మండలంలో నాడు-నేడు రెండో విడతలో 19 పాఠశాలల్లో అదనపు తరగతులు, మౌలిక వసతుల కల్పనకు రూ.9.28 కోట్లు మంజూరు చేసింది. పనులు చేపట్టేందుకు రూ.3.53 కోట్లు విడుదల చేసింది. రూ.3.22 కోట్లు నిధులు అదనపు తరగతుల భవనాల నిర్మాణానికి వెచ్చించారు. మందరాడ, మండపకరిలి, మామిడిపల్లి, సిరిపురం, వాల్తేరు, హొంజారం ఉన్నత పాఠశాలల్లో మంజూరైన అదనపు తరగతి గదులు పూర్తికాకపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు.

★ రాజాం మండలంలో 30 విద్యాలయాలకు అదనపు తరగతి గదులు, మౌలిక సదుపాయాల కల్పనకు ఆయిదేళ్ల క్రితం రూ.10.52 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. భవనాల నిర్మాణానికి రూ.3.77 కోట్లు రాగా రూ.3.49 కోట్లు ఖర్చు చేశారు. మిగిలిన రూ.6.75 కోట్లు నిధులు రాకపోవడంతో పనులు మధ్యలో నిలిపేశారు. పొగిరి, డోలపేట, రాజాం, బుచ్చింపేట, పెనుబాక తదితర పాఠశాలల్లో వసతి సమస్య వేధిస్తోంది.



సంతకవిటి మండలం మందరాడలో నాలుగేళ్లుగా నిలిచిన అదనపు తరగతుల భవనాలు



వంగర మండలం ఎం.సీతారాంపురంలో గదులు చాలక ఆరుబయటే తరగతుల నిర్వహణ

★ వంగర మండలంలో నాడు-నేడు రెండో విడతలో 12 పాఠశాలలకు అదనపు తరగతులు, మౌలిక వసతుల కల్పనకు రూ.2.93 కోట్లు మంజూరు చేసింది. రూ.92 లక్షలు మాత్రమే విడుదల చేసింది. నిధులు సమకూరినంత వరకు భవనాల నిర్మాణం చేపట్టారు. నిధులు చాలకపోవడంతో నిర్మాణాలు మధ్యలోనే నిలిపేశారు. ఎం.సీతారాంపురం, కొప్పర, మరువాడ, యారే గుమ్మడ, కోనంగిపాడు తదితర ఉన్నత పాఠశాలల్లో వసతి సమస్య తీవ్రంగా ఉండటంతో ఆరుబయట, వరండాల్లో విద్యాబోధన చేయాల్సి వస్తోంది.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం.. సంతకవిటి, రాజాం, వంగర మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో వసతి సమస్య తీవ్రంగా ఉంది. మధ్యలో నిలిచిపోయిన భవనాల పరిస్థితిపై ఉన్నతాధికారులకు నివేదికలు అందించాం. ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చిన వెంటనే పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటాం. – బి.శాంతికుమారి, వై.దుర్గారావు, సంతకవిటి, రాజాం, వంగర ఎంఈవోలు



రాజాం మండలం పొగిరిలో పూర్తికాని అదనపు భవనాల పనులు

చిన్నారి ప్రతిభ

5 నెలలకే 120 ఫ్లాష్ కార్డుల గుర్తింపు



మంత్రి సంధ్యారాణితో చిన్నారి, తల్లిదండ్రులు

బొబ్బిలి గ్రామీణం, న్యూస్‌టుడే: బొబ్బిలి మండలం కొత్తపెంట గ్రామానికి చెందిన సిరికి లక్ష్మనాయుడు, హారిక దంపతుల ఐదునెలల కుమార్తె దక్షిత 'నోబుల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు'ను సొంతం చేసుకుంది. ఆ చిన్న వయసులోనే 120 ఫ్లాష్ కార్డులు గుర్తించి రికార్డు సాధించింది. తల్లిదండ్రులు విశాఖలోని ప్రైవేటు సంస్థల్లో పనిచేస్తున్నారు. ఖాళీ సమయంలో పాపకు జంతువులు, పక్షులు, కూరగాయలు, పండ్లు, రంగులు, వివిధ దేశాల జెండాల కార్డులు చూపించి గుర్తు పట్టేలా శిక్షణ ఇచ్చారు. దీనికి సంబంధించిన వీడియోలను నోబుల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సంస్థకు ఆన్‌లైన్‌లో మెయిల్ ద్వారా పంపించారు. వాటిని పరిశీలించి ప్రశంసా పత్రం, పతకాన్ని కొరియర్ ద్వారా అందించారు. మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఆదివారం చిన్నారి తల్లిదండ్రులను సాలూరులో అభినందించారు.

వైభవంగా అక్షరబ్రహ్మ ఆలయం ప్రారంభం

భామిని, న్యూస్‌టుడే: భామిని మండలం సతివాడ సమీపంలోని నూకాలమ్మ గూడ వద్ద అక్షరబ్రహ్మ నూతన ఆలయ ప్రారంభం అంగరంగ వైభవంగా జరిగింది. అక్షరబ్రహ్మ కో-ఆర్డినేటర్ సవర కరువయ్య ఆధ్వర్యంలో ఆదివారం ఒడిశా మాజీ సీఎం గిరిధర్ గమాంగ్ చేతుల మీదుగా నిర్వహించారు. ఇరురాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల గిరిజనులు ఆలయాన్ని అలంకరించారు. అనంతరం ఆదివాసీ మహిళలు థింసా నృత్యాలు, డప్పు వాయిద్యాలు, మేళతాళాలతో అతిథులకు ఘన స్వాగతం పలికారు. పాలకొండ తెదేపా ఇన్‌ఛార్జి పడాల భూదేవి, ప్రముఖ సామాజిక వేత్త గీతాశ్రీకాంత్ ఫౌండేషన్ ఛైర్మన్ గీతా శ్రీకాంత్ జ్యోతి ప్రకాశనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అక్షరాన్ని దైవంగా భావించి పూజించటం గొప్ప సంప్రదాయమని కొనియాడారు. అనంతరం పడాల భూదేవి, గీతాశ్రీకాంత్‌లు కలసి ఆదివాసీ గిరిజనులతో థింసా నృత్యాలు చేసి సందడి చేశారు. తితిదే నుంచి శ్రీవాణి ట్రస్టు సభ్యులు ఆలయ నిర్మాణానికి రూ.10లక్షలు అందించారు. అనంతరం మధ్యాహ్నం 3,500 మందికి అన్న సంతర్పణ నిర్వహించారు. అక్షరబ్రహ్మ గురువు ఎస్పీ మంగయ్య, రాంప్రసాద్ గమాంగ్, దిగాన్‌సమి గమాంగ్, తిస్యాంగ్‌పాల్ గమాంగ్, కె.కామేశ్వరరావు, గంగారావుతో పాటు ఆంధ్రా, ఒడిశా నుంచి పలువురు గురువులు పాల్గొన్నారు.



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఒడిశా మాజీ సీఎం గిరిధర్ గమాంగ్



థింసా నృత్యం చేస్తున్న మహిళలు



పూజల్లో తెదేపా ఇన్‌ఛార్జి పడాల భూదేవి తదితరులు

ఆస్తి పన్ను బకాయిలు రూ.9.91 కోట్లు

పార్వతీపురం పురపాలక, సాలూరు గ్రామీణం, పాలకొండ, న్యూస్‌టుడే:

స్థానిక సంస్థల పరిపాలన ఆదాయ వనరులపైనే ఆధారపడి ఉంటుంది. ముఖ్యంగా పురపాలికల్లో ఆస్తి పన్ను వసూళ్లతో వచ్చే సొమ్ముల తోనే చాలా మేర అభివృద్ధి పనులు చేపడతారు. అలాంటిది జిల్లాలోని మూడు పట్టణాల్లో ఉన్న ప్రభుత్వ కార్యాలయాల నుంచే సుమారు రూ. కోట్ల మేర ఆస్తి పన్ను రావాల్సి ఉంది. ఏళ్లుగా చెల్లింపులు లేకపోవడంతో పాలనపై ప్రభావం పడుతోంది.



రూ.5 కోట్ల మేర చెల్లించాల్సిన పార్వతీపురం జిల్లా ఆసుపత్రి

పార్వతీపురంలో రూ.7.20 కోట్లు..

పార్వతీపురం పురపాలికకు ప్రభుత్వ కార్యాలయాల నుంచి రూ.7.20 కోట్ల మేర ఆస్తి పన్ను రావాలి. జిల్లా ఆసుపత్రి రూ.5 కోట్లు చెల్లించాలి. జంఝావతి కార్యాలయం- రూ.47 లక్షలు, పోలీసు శాఖ- రూ.12.40 లక్షలు, ఎంపీడీవో, తహసీల్దారు, తపాలా శాఖల కార్యాలయాలు వరుసగా రూ.27.51 లక్షలు, రూ.16.47 లక్షలు, రూ.6 లక్షలు, ర.భ.శాఖ- రూ.10.09 లక్షలు, దేవదాయ శాఖ- రూ.9.57 లక్షలు, ఐటీడీఏ రూ.8.66 లక్షలు చెల్లించాల్సి ఉంది. సక్రమంగా పన్ను వసూలు కాకపోవడంతో పురపాలికపై ఆర్థిక భారం పడుతోంది.

తపాలా శాఖ నుంచి రూ.26 లక్షలు..

సాలూరులో ప్రభుత్వ కార్యాలయాల నుంచి పురపాలికకు రూ.1.85 కోట్ల మేర రావాలి. ముఖ్యంగా తపాలా కార్యాలయం 2005-06 వరకు రూ.77,473 బకాయి ఉంది. అపరాధ రుసుముతో కలిపి ప్రస్తుతం బకాయిలు రూ.26,62,151కు చేరింది. ఎంపీడీవో, తహసీల్దారు కార్యాలయాలు రూ.25.98 లక్షలు, రూ.12.40 లక్షలు, గ్రామీణ, పట్టణ పోలీసు స్టేషన్లు- రూ.6.62 లక్షలు, రూ.6.14 లక్షలు, పట్టణ సర్కిల్ కార్యాలయం- రూ.5,23,972, నీటి పారుదల శాఖ కార్యాలయం రూ.3,34,555 బకాయిలు ఉన్నట్లు పుర అధికారులు తెలిపారు. ఏళ్ల తరబడి చెల్లించడం లేదన్నారు.

రూ.36.14 లక్షల జరిమానా..

పాలకొండ నగర పంచాయతీలో 77 ప్రభుత్వ ఆస్తుల నుంచి రూ.86.38 లక్షలు రావాల్సి ఉంది. గతేడాది వరకు రూ.36.65 లక్షల మేర బకాయి ఉండగా మరో రూ.35.86 లక్షలు జరిమానా పడింది. ఈ ఏడాది రూ.13.59 లక్షల బకాయి ఉంది. దీనిపై రూ.28,200 జరిమానా పడింది. ఏళ్లుగా బకాయిలు ఉండటంతో ఈ పరిస్థితి ఏర్పడింది. ఎంపీడీవో, తహసీల్దారు కార్యాలయాల నుంచి రూ.9.24 లక్షలు, రూ.2.75 లక్షలు, ఫారెస్టు రేంజ్ కార్యాలయం- రూ.4.17 లక్షలు, పోలీసు శాఖ కార్యాలయం- రూ.9.70 లక్షలు, జలవనరుల శాఖ డీఈ కార్యాలయం- రూ.2.36 లక్షలు, పోలీసు స్టేషన్ నుంచి రూ.4.62 లక్షలు రావాల్సి ఉంది.

నోటీసులు ఇస్తున్నాం..

ప్రభుత్వ కార్యాలయాల నుంచి ఆస్తి పన్ను బకాయిల వసూలుకు నోటీసులు జారీ చేస్తున్నట్లు పార్వతీపురం ఆర్వో డి.రూబిన్, సాలూరు ఆర్వో పి.ప్రసాద్, పాలకొండ కమిషనరు సర్వేశ్వరరావు తెలిపారు. అధికారులతో మాట్లాడి బకాయిల వసూళ్లకు ప్రయత్నాలు చేస్తున్నామన్నారు.

ధైర్యసాహసాల ప్రతీక.. తూర్పు శౌర్యదీపిక



బెటాలియన్‌లో అమరవీరుల స్తూపం



5వ పోలీసు బెటాలియన్ ముఖద్వారం

డెంకాడ, న్యూస్‌టుడే: పోలీసుల ధైర్యసాహసాలను, త్యాగనిరతిని గుర్తుచేస్తూ ఏటా అక్టోబరు 21న అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహిస్తారు. సంఘ విద్రోహశక్తులు, తీవ్రవాద, ఉగ్రవాదులను ఎదుర్కొంటూ.. శాంతిభద్రతలను పరిరక్షించే క్రమంలో ప్రాణాలను సైతం పణంగా పెడుతున్న పోలీసులను గుర్తుచేసుకోవాల్సిన రోజు. తూర్పు శౌర్యదీపికగా వెలుగొందుతున్న చింతలవలస అయిదో పోలీస్ బెటాలియన్‌లో పనిచేసిన 31 మంది జవానులు శాంతిభద్రతల పరిరక్షణలో తమ ప్రాణాలు పణంగా పెట్టారు.

అండగా నిలుస్తున్నాం.. పోలీసు అమరవీరుల త్యాగాలను గుర్తించి వారి కుటుంబ సభ్యులకు అండగా నిలుస్తున్నాం. వారికి ఎటువంటి సమస్యలు లేకుండా అన్ని రకాలుగా ఆదుకుంటున్నాం. సంఘ విద్రోహశక్తులతో వీరోచితంగా పోరాడిన వారి త్యాగాలు మరువలేనివి.

– మలికా గార్గ్, కమాండెంట్, ఐదో పోలీస్ బెటాలియన్

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	137	244	254

వీఆర్వోల నూతన కమిటీ ఎన్నిక

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: గ్రామ రెవెన్యూ సహాయకుల నూతన కమిటీ ఎన్నిక ఆదివారం విజయనగరంలోని రెవెన్యూ భవనం కార్యాలయంలో నిర్వహించారు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలకు సంబంధించి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడు గరికపాటి బ్రహ్మయ్య, అనంతపురం, కడప జిల్లా నాయకులు రాఘవేంద్ర లింగుట్ల, సతీష్‌కుమార్ ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసు సంఘం నాయకులు తాడ్డి గోవింద, బంగార్రాజు, జోగినాయుడు పాల్గొన్నారు.



విజయనగరం జిల్లా నూతన కమిటీ



పార్వతీపురం మన్యం జిల్లా కమిటీ సభ్యులు

✪ విజయనగరం జిల్లా అధ్యక్షుడిగా వరిగేలా వెంకట గుప్తా, ప్రధాన కార్యదర్శి తాటిపూడి అప్పారావు, సహాధ్యక్షుడు లోల్లా రాజేష్‌శర్మ, ఉపాధ్యక్షులు వి.రమణ, వాకాటి సునీత, కోశాధికారి వడ్డాది జనార్దన్, సంయుక్త కార్యదర్శులు మారడభుడి రాము, కొత్తల సత్తిబాబు, ఎర్రినాయుడు, కార్యవర్గ సభ్యులుగా వరలక్ష్మి, కలిశెట్టి రవి, చుక్క సురేష్, పాంచ్రంకి సన్యాసినాయుడు ఎన్నికయ్యారు.

✪ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడిగా కోసిరెడ్డి సంతోష్ కుమార్, ప్రధాన కార్యదర్శి మూడడ్ల జగన్నాథం, సహాధ్యక్షురాలు లక్ష్మీ ప్రసన్న, ఉపాధ్యక్షులు వై.సతీష్‌కుమార్, ముకుందా, కోశాధికారి గంట సింహాచలం, సంయుక్త కార్యదర్శులు అన్నపూర్ణ, భవానీ, కార్యవర్గ సభ్యులు దమయంతి, పెంట అశోక్, పి.విద్యాసాగర్‌బాబు ఎన్నికయ్యారు.

అపూర్వ సమ్మేళనం

వీరఘట్టం, న్యూస్‌టుడే: వీరఘట్టం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. 1994 పదోతరగతి విద్యార్థులు ఎక్కడెక్కడో వివిధ వృత్తులు, ఉద్యోగాల్లో స్థిరపడిన వారంతా ఒకే వేదికగా కలుసుకున్నారు. ఈసందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తుచేసుకొని, ఒకరికొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను స్మరించుకొని వారి యోగక్షేమాలు తెలుసుకొన్నారు. మూడు దశాబ్దాల తర్వాత కలుసుకొన్న విద్యార్థులు అవధుల్లేని ఆనందంతో కేకు కోసి, ఒకరినొకరు తినిపించుకుని సందడిగా గడిపారు.



వీరఘట్టం ఉన్నత పాఠశాలలో కలుసుకున్న 1994 పదోతరగతి విద్యార్థులు

ఉదయ్‌కిరణ్‌కు లెఫ్టినెంట్ హోదా

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: జిల్లాకు చెందిన ముమ్మిడిశెట్టి ఉదయ్‌కిరణ్‌కి ఎన్‌సీసీలో లెఫ్టినెంట్ హోదా లభించింది. ప్రీ కమిషన్ ఎన్‌సీసీ కోర్సును విజయవంతంగా పూర్తి చేయడం ద్వారా హోదా దక్కింది. మహారాష్ట్రలో ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీలో 85 రోజుల శిక్షణ పొందారు. ప్రస్తుతం ఆయన సత్య డిగ్రీ, పీజీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో అధ్యాపకుడిగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం, ఎన్‌సీసీ అధికారులు అభినందించారు.



లెఫ్టినెంట్ ర్యాంకు బ్యాడ్జీలను పెడుతున్న ఎన్‌సీసీ ఉన్నతాధికారులు

బొబ్బిలి

• బొబ్బిలి • రాజాం • గజపతినగరం • చీపురుపల్లి



అప్పయ్యపేటకు వెళ్లే అనుబంధ రహదారి



అధ్వానంగా బైపాస్ మార్గం

ఈ దారులకు మోక్షం ఎప్పుడో?

బొబ్బిలి, న్యూస్‌టుడే: బొబ్బిలి పట్టణంలోని కీలక రహదారులకు ఏళ్లుగా మోక్షం దక్కడంలేదు. ఎటు వెళ్లాలన్నా ఇబ్బందులే. అప్పయ్యపేట, గొల్లపల్లి గ్రామాలకు లింకు రహదారులు అధ్వానంగా మారాయి. గోతులతో నిత్యం వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. బైపాస్ రహదారిపై రాత్రిపూట తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. స్థానికులు గుంతల్లో మట్టి వేసినప్పటికీ మళ్లీ పరిస్థితి మొదటికి వచ్చింది. పెట్రోలు బంకు వద్ద, పూల్‌బాగ్ నుంచి గొల్లవీధి కూడలి వరకూ భారీ గోతులు ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో పూర్తిస్థాయిలో మరమ్మతులకు ప్రతిపాదనలు పంపినా నిధులు రాలేదు. ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. రహదారుల మరమ్మతులకు ప్రతిపాదనలు పంపామని కమిషనర్ రామలక్ష్మి 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

తెదేపాలో 120 కుటుంబాల చేరిక



మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌తో నాయకులు

గంట్యాడ గ్రామీణం, న్యూస్‌టుడే: నరవ గ్రామానికి చెందిన పలువురు వార్డు సభ్యులతో పాటు 120 కుటుంబాలు మంత్రి కె.శ్రీనివాస్ సమక్షంలో తెదేపాలో చేరాయి. విజయనగరంలో నాయకులు ఎస్.రామునాయుడు, శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంత్రి వీరికి కండువాలు వేసి ఆహ్వానించారు. సీఎం చంద్రబాబు చేపడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వైకాపా వర్గీయులంతా తెదేపాలో చేరడం సంతోషంగా ఉందన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు కె.భాస్కరరావు, ఉపాధ్యక్షుడు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నిధులున్నా.. నేల చూపులేనా..!

అభివృద్ధి పనులు చేపట్టడంలో జాప్యం



సీసీ రహదారికి నోచుకోని ఆంజనేయ కాలనీ-కొండంపేట మార్గం




కొండంపేటలో వరద కాలువ దుస్థితి

న్యూస్‌టుడే- రాజాం


రాజాం పురపాలికలోని పలు ప్రాంతాల్లో అభివృద్ధి పనుల కోసం ఎదురు చూస్తున్న ప్రజలకు నిరీక్షణే మిగులుతోంది. రహదారులు, మురుగు కాలువల నిర్మాణాల కోసం నిధులు కేటాయించి పనులు చేపట్టాలని కోరుతున్నా ఫలితం కనిపించడం లేదు. మున్సిపాల్టీ పరిధిలోని కొండంపేట, అమ్మవారి కాలనీ, టీచర్స్ కాలనీ, ఆదర్శనగర్, ఎస్సీ మెంటిపేట కాలనీ తదితర ప్రాంతాల్లో ఇబ్బందులు కొనసాగుతున్నాయి. పోలిపల్లి పైడితల్లి అమ్మవారి ఆలయం వెనుక ఆంజనేయ కాలనీ ప్రాంతం నుంచి కొండంపేటకు వెళ్లే ప్రధాన రహదారిని సీసీ రోడ్డుగా మార్చాలని పదేళ్లుగా కోరుతున్నా పట్టించుకోవడం లేదు. ఆదర్శనగర్, టీచర్స్ కాలనీల్లో పలు వీధులకు సీసీ కాలువలు, రహదారులు నిర్మించాల్సి ఉంది. ఇంటింటి చెత్త సేకరణ, కాలువల్లో పూడిక తీయడం, వీధి దీపాల ఏర్పాటు, తాగునీటి సరఫరాపైనా అధికారులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. ఇప్పటికే నిధులు కేటాయించామని, ప్రాధాన్యత క్రమంలో ఆయా పనులు చేపడుతున్నామని పురపాలక కమిషనర్ జాగరపు రామ అప్పలనాయుడు పేర్కొన్నారు.

అంధకారంలో పల్లెలు

వంగర, న్యూస్‌టుడే: వంగర మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్తు సరఫరా లేక అంధకారం నెలకొంది. గత మూడు రోజులుగా రాత్రి 8 గంటల సమయంలో విద్యుత్తు నిలిపి వేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. తిరిగి తెల్లవారుజామున 2 వరకు పునరుద్ధరించడం లేదని వాపోతున్నారు. రాజులగుమ్మడ, కొప్పరవలస, వి.వి.ఆర్.పేట తదితర ప్రాంతాల్లో ఈ పరిస్థితి నెలకొంది. విద్యుత్తు శాఖ అధికారుల నిర్వాకంతో రాత్రి వేళల్లో దోమలతో సావాసం చేస్తున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఏఈ సాంబశివరావు మాట్లాడుతూ.. వర్షం కురవడంతో సరఫరాకు అంతరాయం కలిగిందని చెప్పారు.











కలుషిత నీరు తాగేదెలా?



ట్యాంకు వద్ద మహిళల నిరసన

వంగర, న్యూస్‌టుడే: మండలంలోని కొప్పరవలస రక్షిత పథకం నీరు కలుషితం అవుతున్నాయని గ్రామస్థులు ఆదివారం ఆందోళన వ్యక్తం చేశారు. ట్యాంకు పైకప్పు లేకపోవడంతో పక్షులు దాహార్తి కోసం లోపలికి వెళ్లి చిక్కుకుపోతున్నాయని, కొన్ని చనిపోవడంతో తాగునీరు కలుషితమై దుర్వాసన వస్తోందని వాపోతున్నారు. అధికారులు స్పందించి ట్యాంకుపై కప్పు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. దీనిపై జేఈ శ్రీచరణ్ మాట్లాడుతూ..మంచి నీటి పథకం శుభ్రం చేయిస్తామన్నారు.

సమస్యలు పరిష్కరిస్తా

బొబ్బిలి గ్రామీణం, బొబ్బిలి: దిబ్బగుడివలసలో శిథిలావస్థకు చేరిన ఆరోగ్య ఉపకేంద్రాన్ని ఎమ్మెల్యే బేబినాయన ఆదివారం పరిశీలించారు. శిథిల భవనం అనువుగా లేదని స్థానికులు తెలియజేశారు. మరమ్మతులు చేయాలని పిరిడి పీహెచ్‌సీ వైద్యాధికారి వంశీ, ఆరోగ్యకార్యకర్తలు వినతిపత్రాన్ని అందించారు. సమస్యలను పరిష్కరిస్తానని ఆయన చెప్పారు. మేదరబంద కూడలిలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని తరలించేందుకు చర్యలు తీసుకోవాలని మహిళలు కోటలో ఎమ్మెల్యేను కోరారు.



వినతిపత్రాన్ని చదువుతున్న ఎమ్మెల్యే బేబినాయన

కూటమితో పల్లెల అభివృద్ధి



పనులు ప్రారంభించిన రామ్‌మల్లిక్, అధికారులు

చీపురుపల్లి, గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామాల అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని తెదేపా రాష్ట్ర కార్యదర్శి కె.రామ్‌మల్లిక్‌నాయుడు అన్నారు. అలజంగి, పుర్రేయవలసలో రూ.40 లక్షల వ్యయంతో సీసీ కాలువలు, రహదారులు, చీపురుపల్లిలోని గవిడివీధి, జి.అగ్రహారంలో రూ.33 లక్షలతో రహదారుల పనులకు శంకుస్థాపన చేశారు. పార్టీ మండలాధ్యక్షుడు ఆర్.కామునాయుడు, ఎంపీపీ వెంకటనర్సమ్మ, జడ్పీటీసీ సభ్యురాలు శిరీష, సర్పంచి సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

'సీపీఎస్ రద్దుకు కృషి చేస్తాం'



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ, పీఆర్‌టీయూ అభ్యర్థి గాదె

బొబ్బిలి, న్యూస్‌టుడే: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలిపిస్తే ఉపాధ్యాయ వర్గాలకు సంబంధించిన అన్ని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్సీ, పీఆర్‌టీయూ మిత్రపక్షాల అభ్యర్థి గాదె శ్రీనివాసులునాయుడు అన్నారు. ఆదివారం స్థానిక చైతన్య పాఠశాలలో పీఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి చింతా రమణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఆరేళ్లుగా ఉపాధ్యాయులు ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారని, గెలిచాక సీపీఎస్ రద్దుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మన్యం జిల్లా పీఆర్‌టీయూ అధ్యక్షుడు వాలేటి తవిటినాయుడు, జిల్లా కార్యదర్శి డి.శ్రీనివాస్, ఉత్తరాంధ్ర మీడియా ఇన్‌ఛార్జి శివప్రసాద్, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

రోగులు ధైర్యంగా ఉండండి



పరామర్శిస్తున్న నాగార్జున

గుర్ల, న్యూస్‌టుడే: గుర్లలో అతిసార లక్షణాలతో బాధపడుతున్న వారిని తెదేపా పార్లమెంటరీ అధ్యక్షుడు కిమిడి నాగార్జున ఆదివారం పరామర్శించారు. వారికి అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. అందరూ ధైర్యంగా ఉండాలని సూచించారు. ప్రజలు అనారోగ్యంతో బాధపడుతుంటే వైకాపా నాయకులు రాజకీయాలు చేయడం సిగ్గు చేటన్నారు. గత అయిదేళ్లలో చీపురుపల్లి సామాజిక ఆసుపత్రిని ఎందుకు అభివృద్ధి చేయలేదని ప్రశ్నించారు.

బాధిత కుటుంబాలకు పరిహారం ఇవ్వాలి



రోగితో మాట్లాడుతున్న బొత్స

గుర్ల, న్యూస్‌టుడే: గుర్లలో అతిసారం లక్షణాలతో మృతిచెందిన వారి కుటుంబ సభ్యులకు ప్రభుత్వం పరిహారం అందించాలని ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ డిమాండు చేశారు. ఆదివారం రోగులను పరామర్శించారు. జడ్పీ ఛైర్మన్ ఎం.శ్రీనివాసరావు, మాజీ ఎంపీ బి.చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్యే కె.జోగులు, వైకాపా నాయకులు ఉన్నారు.

సత్యసాయి మార్గం అనుసరణీయం

రాజాం, న్యూస్‌టుడే: సత్యసాయి మార్గం అనుసరణీయమని జిల్లా అధ్యక్షుడు వీవీఎస్ సునీల్‌కుమార్ పేర్కొన్నారు. సత్యసాయి బాబా అవతార ప్రకటన దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక సుందరం మందిరంలో నిర్వహించిన ఆధ్యాత్మిక కార్యక్రమంలో ఆయన పాల్గొని, ప్రసంగించారు. పట్టణంలో నగర సంకీర్తన, సత్యసాయి చిత్రపటంతో ర్యాలీ నిర్వహించారు.



పాల్గొన్న భక్తులు

నాగళ్లవలసలో వైద్య శిబిరం

గుర్ల, న్యూస్‌టుడే: నాగళ్లవలసలో ముగ్గురిలో అతిసారం లక్షణాలు కనిపించడంతో యంత్రాంగం అప్రమత్తమైంది. గ్రామంలో ఆదివారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్యారోగ్య శాఖ కమిషనర్ ఎ.సిరి శిబిరాన్ని సందర్శించి సేవలపై ఆరా తీశారు. తెట్టంగి పీహెచ్‌సీ వైద్యాధికారి అక్విబ్‌తో మాట్లాడారు. గ్రామంలో తాగునీటి పరీక్షలు చేయాలని, ట్యాంకుల ద్వారా మాత్రమే సరఫరా జరగాలని సూచించారు.









ఆలయ ఈవోగా శ్యామలరావు

వంగర: సంగమేశ్వర ఆలయ ఈవోగా పి.శ్యామలరావు బాధ్యతలు స్వీకరించారు. ఆదివారం స్వామివారిని దర్శించుకొని పూజలు చేశారు. ఉత్సవ కమిటీ ఛైర్మన్‌గా బి.ఆనందరావు, ప్రధాన అర్చకుడిగా సి.గణపతిరావును నియమించినట్లు చెప్పారు.

వైద్యానికి రూ.లక్ష సాయం

చీపురుపల్లి: రహదారి ప్రమాదంలో తీవ్ర గాయాలతో వైద్యం పొందుతున్న ఆశయ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు ఆర్.రమణకు నియోజకవర్గ తూర్పుకాపు ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రతినిధులు రూ.లక్ష సాయం చేశారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు నగదు అందజేశారన్నారు.

మాతృభాషను మరవొద్దు

రాజాం: మాతృభాషను మరవొద్దని, పిల్లల్లో తెలుగుపై మక్కువ కలిగేలా తల్లిదండ్రులు కృషి చేయాలని వికాసతరంగిణి కేంద్ర కమిటీ కార్యనిర్వాహక కార్యదర్శి రమణమూర్తి అన్నారు. స్థానిక కార్యాలయంలో నిర్వహించిన పద్య పఠన పోటీల్లో 200 మంది విద్యార్థులు పాల్గొనగా, విజేతలకు జ్ఞాపికలు అందించారు.

యోగా శిక్షణ తరగతులు

రాజాం: పట్టణంలోని గాయత్రీ కాలనీ సమీపంలో వికాసతరంగిణి ఆధ్వర్యంలో పది రోజులపాటు నిర్వహించనున్న ఉచిత యోగా శిక్షణ తరగతులను ఆదివారం ప్రారంభించారు. యోగా గురువు టీటీవీ రమణమూర్తి, కె.రవి, వి.పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.



విజయనగరం

• విజయనగరం • నెల్లిమర్ల • ఎస్.కోట

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)
విజయనగరం పట్టణం - 80089 02900
విజయనగరం గ్రామీణం - 80085 74317
ఎస్.కోట - 80085 74326
భోగాపురం - 80085 74319

?: దాసన్నపేట నీళ్ల ట్యాంకు, బాబామెట్ట ఎల్ఐజీ- 330 ప్రదీప్‌నగర్‌లో వీధి దీపాలు వెలగడం లేదు. – స్థానికులు

● సిబ్బందిని పంపించి, బాగు చేయిస్తాం. – రమణ, లైటింగ్ సూపర్‌వైజర్

?: అంబేడ్కర్ కాలనీలోని మసీదు దగ్గర కుక్కలు ఎక్కువగా ఉన్నాయి. పాఠశాలలకు వెళ్లే పిల్లలు ఇబ్బంది పడుతున్నారు. – మహమ్మద్ సిద్ధిక్, స్థానికుడు

● అక్కడి కుక్కలకు సంతాన నిరోధక శస్త్ర చికిత్సలు నిర్వహిస్తాం. – డా.కొండపల్లి సాంబమూర్తి, ప్రజారోగ్య అధికారి, నగర పాలక సంస్థ

– న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

గుంతల పూడ్చివేత

స్పందనకు వందనం

లక్కవరపుకోట, న్యూస్‌టుడే: తలారి గ్రామంలో రోడ్డు గుంతలమయమై ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. దీనిపై ఇటీవల 'ఈనాడు'లో వెలువడిన కథనానికి సర్పంచి జి.జ్యోతిరత్నం స్పందించారు. రాతి బుగ్గితో గుంతలు పూడ్చారు.

మాదక ద్రవ్యాలకు బానిసకావొద్దు

డెంకాడ, న్యూస్‌టుడే: యువత, విద్యార్థులు మాదక ద్రవ్యాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎస్సై సన్యాసినాయుడు అన్నారు. ఆదివారం చింతలవలస సమీపంలోని ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాల, జొన్నాడ లెండి ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణం, ప్రధాన కూడళ్లలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ఎవరైనా మాదకద్రవ్యాలు విక్రయించినా, రవాణా చేసినా క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

నెల్లిమర్ల: నెల్లిమర్లలోని మహాత్మా జ్యోతిబా పులే బీసీ సంక్షేమ బాలికల గురుకుల కళాశాల విద్యార్థిని ఎ.ప్రమీల ఈనెల 19న జరిగిన అండర్-19 స్కూల్‌గేమ్స్ జిల్లాస్థాయి డిస్కస్‌త్రో పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయురాలు కామేశ్వరి తెలిపారు. విద్యార్థినిని ప్రిన్సిపల్ రమామోహిని, అధ్యాపకులు అభినందించారు.

ఆత్మీయ కలయిక.. ఆనంద వేడుక



జామి, న్యూస్‌టుడే: అలమండ జడ్పీ ఉన్నత పాఠశాలలో 1985-86లో చదువుకున్న పూర్వవిద్యార్థులు ఆదివారం పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నాటి మధురస్మృతులను గుర్తుచేసుకొని రోజంతా ఆనందంగా గడిపారు. వీరి కలయికకు కృషిచేసిన సగినేటి రవిరాజు, పాండ్రంగి రమణమూర్తిని అభినందించారు.

నగర జీవనం.. సమస్యలతో సావాసం



కేఎల్‌పురం ప్రాంతంలో ఇళ్ల మధ్య మురుగు

న్యూస్‌టుడే – విజయనగరం పట్టణం

గత అయిదేళ్ల వైకాపా పాలనలో విజయనగరం నగరపాలికలో మౌలిక సదుపాయాలు సమకూరకపోవడంతో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. రహదారులు, మురుగు, తాగునీటి సమస్యలతో ప్రజలు సతమతమవుతున్నారు. అరకొర సదుపాయాలతో నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శివారు ప్రాంతాలు, కాలనీలు, విలీన పంచాయతీల్లో ప్రజలు నరకయాతన పడుతున్నారు.

ఈ రహదారులతో ఇబ్బందులు..

నగరంలోని కేఎల్‌పురం, కామాక్షినగర్, పైడిమాంబ కాలనీ, సాయిలలితనగర్, సాయికీర్తన నగర్, రెవెన్యూ కాలనీ, వినాయకనగర్, కోయినగర్, తదితర చోట్ల రహదారులు, కాలువలు, వీధిదీపాలు వెలగని పరిస్థితి. కేఎల్‌పురం ప్రాంతంలో మురుగు ఇళ్ల చుట్టుపక్కల నిలుస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సొంత నిధులతో కంకర వేసుకోవాల్సిన పరిస్థితి నెలకొందని పేర్కొంటున్నారు.



స్టేడియంపేటలో ప్రారంభానికి నోచుకోని సామాజిక మరుగుదొడ్లు

ట్యాంకరు నీరే గతి..

కేఎల్‌పురంలో మంచినీటి పథకం నిర్మించినా పూర్తిస్థాయిలో ఇంటింటి కుళాయిలు వేయలేదు. ఇప్పటికీ వారానికి రోజు విడిచి రోజు చొప్పున 14 ట్యాంకర్లు పంపిస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ కాలనీలో కుళాయిలు వేసినా ఇంటర్ కనెక్షన్లు కలపకపోవడంతో నీరు రావడం లేదని అంటున్నారు. కొండపేట ప్రాంతంలో పైపులైను వేయలేదని చెబుతున్నారు. పలుచోట్ల అప్రోచ్ రోడ్లు ప్రమాదకరంగా ఉన్నాయి. పైపులైన్ల కోసం తవ్విన గుంతలు సరిగ్గా పూడ్చలేదు. పలుచోట్ల స్తంభాలు వేసినా దీపాలు ఏర్పాటు చేయలేదు.

పేరుకుపోతున్న చెత్త..

బాలాజీనగర్ ప్రాంతంలో పారిశుద్ధ్య సమస్య వేధిస్తోంది. మరమ్మతుకు గురైన కల్వర్టులు ఉన్నాయి. కోట ఎదురుగా గురాచారి వీధి దారిలో ఖాళీ స్థలంలో చెత్తగుట్టలు పేరుకుపోయాయి. కాలువల వ్యవస్థ సరిగ్గా లేక మురుగు కదలడంలేదు. ఎంఆర్ కళాశాల హాస్టల్ దారి అపరిశుభ్రంగా ఉంది. కానుకుర్తివారి వీధిలో పందుల సంచారం ఉందని, కాలువలు శుభ్రం చేయడం లేదని స్థానికులు తెలిపారు. స్టేడియంపేట ప్రాంతంలో సామాజిక మరుగుదొడ్లు నిర్మించినా.. ప్రారంభించకుండా వదిలేశారు. ఎస్పీ బంగ్లా దారిలో చెట్లకొమ్మలు వారాల తరబడి తీయకుండా ఉన్నాయి. ఇక్కడ భవన, నిర్మాణ వ్యర్థాలు గుట్టలుగా ఉన్నా సిబ్బంది పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కమిషనరు పి.నల్లనయ్య తెలిపారు.

ఉత్సాహంగా చదరంగం పోటీలు



విజేతలైన చిన్నారులతో నిర్వాహకులు

విజయనగరం క్రీడలు, న్యూస్‌టుడే: శ్రీచెస్, ఆంధ్రా చెస్ అసోసియేషన్ సంయుక్తంగా ఫైర్ చెస్ స్కూల్ సహకారంతో విజయనగరంలో మూడు రోజులపాటు నిర్వహించిన రాష్ట్రస్థాయి ఏపీ అండర్-9, ఓపెన్ బాలికల చెస్ ఛాంపియన్‌షిప్ ఆదివారంతో ముగిసింది. ఓపెన్ విభాగంలో ప్రథమ విజేతగా సీహెచ్.దాన్విన్ రామ్(కాకినాడ), ద్వితీయ స్థానంలో ఎం.శ్రీసాకేత్(అనంతపురం) నిలిచారు. బాలికల విభాగంలో ప్రథమ స్థానంలో వి.మోదితారెడ్డి (తిరుపతి), ద్వితీయ స్థానంలో సీహెచ్.అనన్య(తూర్పుగోదావరి) నిలిచారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు డిసెంబరులో పుణేలో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆంధ్రా చెస్ సంఘం సీఈవో కేవీ జ్వాలాముఖి తెలిపారు. సంఘం కోశాధికారి కేకే.జగన్నాథ, ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అధ్వాన రోడ్డుతో అవస్థలు



తెన్నుబొడ్డవర కూడలిలో జాతీయ రహదారి నుంచి మెట్టపాలెం వెళ్లే తారురోడ్డు గోతులతో అధ్వానంగా మారింది. వర్షం పడితే నీరు చేరిపోయి చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై మండల ఇంజినీరింగు అధికారి సత్యనారాయణ వద్ద ప్రస్తావించగా బొడ్డవర కూడలి నుంచి చిట్టంపాడుకు పీఎం జన్‌మన్ పథకం కింద రూ.11.30 కోట్లతో రోడ్డు మంజూరైందన్నారు. ఈ దారి కూడా అందులోకి వస్తుందన్నారు. త్వరలో పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. – న్యూస్‌టుడే, శృంగవరపుకోట

ఈ నిర్మాణానికి నాలుగేళ్లు

విజయనగరం మండలం బియ్యాలపేట గ్రామ సచివాలయ నిర్మాణం నాలుగేళ్లుగా కొనసాగుతోంది. అన్ని సౌకర్యాలతో సచివాలయం నిర్మిస్తామని అప్పటి వైకాపా ప్రభుత్వం నిర్మాణ పనులు ప్రారంభించి పూర్తి చేయలేకపోయింది. దాదాపుగా 75 శాతం పూర్తయిన సచివాలయం నిర్మాణాన్ని పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని గ్రామస్థులు కోరుతున్నా ప్రయోజనం కనిపించట్లేదు. ఈ సమస్యను ఈవోపీఆర్డీ తిరుపతినాయుడు వద్ద ప్రస్తావించగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు.



– న్యూస్‌టుడే, విజయనగరం గ్రామీణం

ఇలాగైతే రోగాలు రావా?



నగరంలో పాడైన డంపర్ బిన్లతో పారిశుద్ధ్య సమస్య పెరుగుతోంది. వీధుల్లో పేరుకుపోయిన చెత్తను అందులో వేస్తున్నారు. అవి మరమ్మతుకు గురై రంధ్రాలతో ఉండటంతో చెత్త కింద పడుతోంది. 50వ డివిజన్ పరిధిలోని వైఎస్సార్ నగర్‌లో 6 బిన్లు పాడై పరిసర ప్రాంతాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. తాగునీటి ట్యాంకు వచ్చినప్పుడు నీటిని పట్టుకోవడానికి ఇబ్బందిగా ఉంటోందని స్థానికులు చెబుతున్నారు. కొత్త బిన్ల కొనుగోలుకు ప్రతిపాదనలు చేశామని, రాగానే మారుస్తామని ప్రజారోగ్య అధికారి సాంబమూర్తి తెలిపారు.
– న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

అలరించిన నృత్య ప్రదర్శన

పైడితల్లి అమ్మవారి పండగ సందర్భంగా నగరంలోని మూడులాంతర్లు సమీపంలోని చదురుగుడి ప్రాంగణంలో వైభవలక్ష్మి చిన్నారుల బృందం నృత్య ప్రదర్శనలు అలరించాయి. ఈ సందర్భంగా దేవస్థానం సిబ్బంది చిన్నారులను అభినందించారు. వై.సాయిదుర్గాప్రసాద్ గిటారు, సామవేదుల సత్యలత భక్తిగీతాల కచేరీ ఆకట్టుకున్నాయి.
– న్యూస్‌టుడే, కంటోన్మెంట్



ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు



సారికలో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అదితి

విజయనగరం గ్రామీణం, శృంగవరపుకోట, నెల్లిమర్ల, డెంకాడ, జామి, న్యూస్‌టుడే: ఆర్థిక సంక్షోభంలో ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో విజయవంతంగా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్న ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు చెప్పారు. ఆదివారం సాయంత్రం విజయనగరం మండలంలోని చిల్లపేట, సారిక, గుండాలపేట, బియ్యాలపేట, పడాలపేట, నారాయణపురంలో పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆమె శంకుస్థాపన చేశారు. ఎంపీడీవో చంద్రకళ తదితరులు పాల్గొన్నారు. ★ పల్లెపండుగ కార్యక్రమంతో పల్లెలకు మహర్దశ వస్తుందని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. ఎస్.కోట పట్టణం, తిమిడి, వెంకటరమణపేట గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల రాంప్రసాద్, జనసేన నియోజకవర్గ కన్వీనరు వబ్బిన సత్యనారాయణ, ఎంపీపీ సోమేశ్వరరావు, మండల ఉపాధ్యక్షురాలు ఇందుకూరి సుబ్బలక్ష్మి, మండల పార్టీ అధ్యక్షుడు జీఎస్ నాయుడు పాల్గొన్నారు. ★ గ్రామాలను అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే లోకం నాగమాధవి, రాష్ట్ర మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు అన్నారు. పూతికపేట గ్రామంలో సీసీ రహదారికి శంకుస్థాపన చేశారు. నాయకులు ఎస్.రవిశేఖర్, సీహెచ్.వెంకటరమణ, కె.ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ★ డెంకాడ మండలం బొడ్డవలసలో సీసీ రహదారి నిర్మాణానికి ఎమ్మెల్యే లోకం నాగమాధవి, మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు శంకుస్థాపన చేశారు. ఎంపీపీ బి.వాసుదేవరావు, మాజీ ఎంపీపీ కె.చంద్రశేఖర్, మండల పార్టీ అధ్యక్షుడు పి.భాస్కరరావు పాల్గొన్నారు. ★ జామి మండలం గజపతిగనరం నియోజకవర్గ పరిధిలోని విజినిగిరి, తాండ్రంగి, లొట్లపల్లి గ్రామాల్లో పల్లెపండగ నిర్వహించారు. ఎంపీడీవో నీలం అప్పలనాయుడు, ఏపీవో కిరణ్మయి పాల్గొన్నారు.



ఎస్.కోటలో ఎమ్మెల్యే లలితకుమారి



పూతికపేటలో ఎమ్మెల్యే నాగమాధవి, కర్రోతు తదితరులు

జూద శిబిరంపై దాడి

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధిలోని నెల్లిమర్ల టిడ్కో గృహ నిర్మాణాల ప్రాంతంలో జూద శిబిరంపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. ఆరుగురిని అదుపులోకి తీసుకొని, రూ.5,520 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై గణేష్ తెలిపారు.

158 మంది రాజీనామా

లక్కవరపుకోట: ఎల్.కోట మండలంలో ఇప్పటివరకు 158 మంది వాలంటీర్లు రాజీనామా చేసినట్లు ఎంపీడీవో రూపేష్ తెలిపారు. శనివారం రంగారాయపురం గ్రామానికి చెందిన 9 మంది రాజీనామా చేశారని చెప్పారు.

రూ.10 వేల ఆర్థిక సాయం

కొత్తవలస: కొత్తవలసకు చెందిన ఎం.నాగమణి అనారోగ్యంతో బాధపడుతుండగా.. నిమ్మలపాలేనికి చెందిన జాయినింగ్ హ్యాండ్స్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు ఆదివారం రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు.

బోధనకే పరిమితం చేయాలి

విజయనగరం రింగురోడ్డు: బోధనేతర పనులు రద్దు చేసి, ఉపాధ్యాయులను బోధనకు మాత్రమే పరిమితం చేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జేఏవీఆర్‌కే ఈశ్వరరావు కోరారు. కేఎల్‌పురంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. యూటీఎఫ్ స్థాపించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా జనవరి 5, 6, 7, 8 తేదీల్లో కాకినాడలో నిర్వహించనున్న స్వర్ణోత్సవ మహాసభలకు ఉపాధ్యాయులంతా హాజరు కావాలని కోరారు.

అవీ..ఇవీ..అన్నీ

125 మందికి వైద్య సేవలు

కొత్తవలస, న్యూస్‌టుడే: పుట్టపర్తి సత్యసాయిబాబా అవతార ప్రకటన దినోత్సవం సందర్భంగా కొత్తవలస సత్యసాయి సేవా సమితి దత్తత గ్రామం ఒడ్డిపేటలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. కొత్తవలస సాయి వెంకటేశ్వర ఆసుపత్రి వైద్యులు 125 మందికి తనిఖీలు చేసి మందులు అందజేశారని సమితి కన్వీనర్ పి.రవికుమార్ తెలిపారు.



గౌరమ్మకు సారె సమర్పణ

కొత్తవలస: వీరభద్రపురం పంచాయతీ శివారు ములగపాకవానిపాలెంలో (దాసరివానిపాలెం) నిర్వహిస్తున్న గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు ముగింపు సందర్భంగా గౌరీదేవికి ఆదివారం గ్రామస్థులు సారె సమర్పించారు. 41 రకాల పిండివంటలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించి రామాలయంలో ఉన్న గౌరీదేవి విగ్రహం ముందు పెట్టారు.

గ్రామాల అభివృద్ధికి అడుగులు

రూ.25.21 కోట్లతో పనులు



బీటీ రహదారిగా మారనున్న రామతీర్థం గిరిప్రదక్షిణ దారి

న్యూస్‌టుడే – నెల్లిమర్ల, పూసపాటిరేగ, డెంకాడ, భోగాపురం

అయిదేళ్లు అవస్థల్లో మూలిగిన గ్రామాలకు మహర్దశ కలగనుంది. కూటమి ప్రభుత్వం అన్ని గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమం నిర్వహిస్తూ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టింది. దీనికి ఉపాధిహామీ నిధులు కేటాయించింది. నెల్లిమర్ల నియోజకవర్గంలోని అన్ని పంచాయతీల్లో సిమెంటు రహదారులు, కాలువలు తదితర పనులకు నాయకులు శంకుస్థాపనలు చేస్తున్నారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 261 పనులను గుర్తించారు. వీటిని రూ.25.21 కోట్లతో చేసేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

మండలం	పనులు	నిధులు (రూ.కోట్లు)
నెల్లిమర్ల	78	6.61
పూసపాటిరేగ	82	6.19
భోగాపురం	36	6.51
డెంకాడ	65	5.89

మార్చిలోగా పూర్తి చేయాలి..

నియోజకవర్గంలో మంజూరు చేసిన అన్ని అభివృద్ధి పనులను వచ్చే ఏడాది మార్చిలోగా పూర్తిచేయాలి. ప్రస్తుతం మండలస్థాయి ఇంజినీరింగ్ అధికారులకు, ఉపాధిహామీ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశాం. సకాలంలో పూర్తి చేస్తే నిధులు విడుదల అవుతాయి. పనుల నాణ్యత పర్యవేక్షణకు ప్రత్యేక అధికార బృందాలను ఏర్పాటు చేస్తున్నాం. సంబంధిత గుత్తేదారులు తప్పనిసరిగా నాణ్యత ప్రమాణాలను పాటించాల్సిందే. ఎలాంటి లోపాలు ఉన్నా నిధులు నిలుపుదల చేస్తాం.
– అర్జున అప్పారావు, డీఈ, పంచాయతీరాజ్

బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో సత్తా



ఎంపికైన క్రీడాకారులు, అసోసియేషన్ సభ్యులు

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: ఎస్.కోట మండలం భవానీనగర్‌లోని డా.వరలక్ష్మీ వ్యాయామ కళాశాలలో ఆదివారం జరిగిన జిల్లాస్థాయి సీనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలను డా.వరలక్ష్మి ప్రారంభించారు. ఎంపికైన క్రీడాకారులు నవంబరు 8, 9, 10 తేదీల్లో నంద్యాలలో జరగనున్న రాష్ట్రస్థాయి టోర్నమెంటులో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు టి.శ్రీనివాస్ క్రీడాకారులకు టీషర్టులు అందజేశారు. అసోసియేషన్ కార్యదర్శి జి.లక్ష్మణరావు, శ్రీరాములు, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల మూసివేతపై పోరాడాలి



హాజరైన కార్మికులు

కొత్తవలస, న్యూస్‌టుడే: వ్యవసాయ ఆధారిత పరిశ్రమల మూసివేతకు వ్యతిరేకంగా కార్మిక వర్గం పోరాడాలని ఏఐఎఫ్‌టీయూ (న్యూ) కార్యదర్శి కిషోర్‌బాబు పిలుపునిచ్చారు. ఆదివారం కొత్తవలస జ్యూట్ మిల్స్ వర్కర్స్ యూనియన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ప్రభుత్వాలు పంటలకు గిట్టుబాటు ధర కల్పించకుండా వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలోకి నెడుతున్నాయన్నారు. జ్యూట్ మిల్స్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు గణేష్ పండా మాట్లాడుతూ ఉమా జ్యూట్వయిన్ మిల్స్‌కు యాజమాన్యం అక్రమంగా లాకౌట్ విధించి కార్మికులకు అన్యాయం చేసిందన్నారు. యూనియన్ ఉపాధ్యక్షుడు కె.శ్రీను, కార్యదర్శి కె.ఈశ్వరరావు, కోశాధికారి ఎస్.గోవింద తదితరులు పాల్గొన్నారు.